

పరిగిలోని 15వ వార్డులో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్



తాండూరు: రజతోత్సవ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు



ధారూరు : సభకు బయలు దేరుతున్న మండల నాయకులు



కొడంగల్ :అంబేద్కర్ కూడలిలో బీఆర్ఎస్ జెండా ఎగరవేసిన బీఆర్ఎస్ నాయకులు

# దారులన్నీ రజతోత్సవ సభకే..

- స్వచ్ఛందంగా కదిలిన గులాబీశ్రేణులు, అభిమానులు
- గ్రామగ్రామాన ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు
- ఊరూరా గులాబీజెండాల రెపరెపలు..
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు
- పార్టీకి పూర్వవైభవం వచ్చిందని వెల్లడి

పరిగి, ఏప్రిల్27:బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా వరంగల్ సమీపంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగసభకు పరిగి నియోజకవర్గం లోని ప్రతి గ్రామం, గిరిజనతండాల నుంచి గులాబీదండు కదిలి వెళ్లింది. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడా పూర్, గండీడ్, మహ్మదాబాద్ మండలాల నుంచి 60 ఆర్టీసీ బస్సులు, సుమారు 250 ప్రైవేటు, సొంత వాహనాల్లో బీఆర్ ఎస్ నాయకులు, శ్రేణులు, అభిమానులు వరంగల్ సభకు తరలి వెళ్లారు. పెద్ద గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయగా, చిన్న గ్రామాలకు ప్రైవేటు వాహనాలను సమకూర్చారు. అనేక మంది పార్టీ అభిమానులు తమ స్వంత వాహనాలలో వరంగల్ సభకు వెళ్లారు. సభకు వెళ్లే ముందు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి పండుగ వాతావరణంలో సంబురాలు జరుపుకొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అత్యంత ఉత్సాహంగా తమ అధినేత కేసీఆర్ ప్రసంగం వినేందుకు సభకు తరలివెళ్లారు. కార్యక్రమాలలో పరిగి మండలంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎ.సురేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్.భాస్కర్, దోమ మండలం నుంచి మాజీ జడ్పీటీసీలు కొప్పుల నాగారెడ్డి, బి.లక్ష్మయ్య, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, ఖాజాపాష, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో మాజీ జెడ్పీటీసీ రాందాస్, నాయకులు సత్తినేని సుధాకర్‌రెడ్డి, పీరంపల్లి రాజు, సారా శ్రీనివాస్, రాజ ప్ప, మాలె క్రిష్ణయ్యగౌడ్, పూడూరు మండలంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ మార్కెట్ చైర్మన్ అజహరుద్దీన్, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ రాజేం దర్‌రెడ్డి, బుచ్చన్న, వెంకటయ్య, ఎస్.యాదవరెడ్డి, కె.ప్రవీణ్ పాల్గొన్నారు.

**వికారాబాద్:** వికారాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అంతకు ముందు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా వికారాబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఎగరవేశారు. వికారాబాద్ నియోజకవర్గంలోని వికారా బాద్‌తో పాటు ధారూ రు, మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి, నవాబుపేట మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పార్టీ జెండాలను ఎగరవేశారు. అనంతరం కేసీఆర్ బహిరంగ సభకు పార్టీ నాయకులు ఆర్టీసీ బస్సులలో బయలు దేరారు. మరి కొంత మంది అభిమానులు, శ్రేయోభిలాషులు స్వచ్ఛంధంగా ప్రైవేటు వాహనాల్లో వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్‌ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, బంట్వారం మండల అధ్యక్షుడు మల్లేశం, మోమిన్‌పేట మండల అధ్యక్షుడు వెంకట్, ధారూరు మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, నవా బుపేట మండల అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దోమ మండల కేంద్రంలో జెండా ఎగురవేస్తున్న మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య

**తాండూరు:** తాండూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా తరలి వెళ్లారు. గులాబీ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి పిలుపు మేరకు ప్రత్యేక బస్సులు, కార్లు, ఇతర వాహనాలలో వేలాది మంది ఉద్యమ తరహాలో తరలి వెళ్లారు. అంతకు ముందు నియోజకవర్గంలోని తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండల పరిధిలోని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా గులాబీ నేతలు మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం వచ్చిందన్నారు. కాంగ్రెస్ మాటలకు, హామీలకు ప్రజలు మోసపోయిన విషయం అందరికి తెలుస్తుందన్నారు. అందుకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలనే సంకల్పంతో ప్రజలు స్వచ్ఛందగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీఆర్ఎస్ పార్టీ మరింత ముం దుకు దూసుకు వెలుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే ఘన విజయమని ధీమా వ్యక్తం చేశారు.



మర్పల్లిలో సభకు బయలు దేరుతున్న నాయకులు

**కొడంగల్:** నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల బీఆర్ఎస్ నాయకుల దండులా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన బీఆర్ఎస్ నాయకులు ఆనందోత్సవాల నడుమ గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాలను ఎగరవేసి వరంగల్ సభకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. మేము సైతం బీఆర్ఎస్ సైనికుల మంటూ, కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభ్యున్నతి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## అపూర్వ స్పందన: మాజీ ఎమ్మెల్యే కొప్పుల

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని, ఊరూవాడా ఒక్కటై సభకు వచ్చారని పరిగి మాజీ ఎమ్మె ల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ అధికారం లోకి రావడం ఖాయమన్నారు. వరంగల్ సభకు వెళ్లే ముందు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం పరిగిలో బీఆర్ఎస్ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. ప్రతి గ్రామం నుంచి అన్ని వర్గాల వారు వరంగల్ సభకు వచ్చేందుకు ముందుకు వచ్చారని, వారికి వాహనాలు సమకూర్చలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. తెలంగాణ సాధించడంతోపాటు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని వినడానికి వరంగల్ సభకు పరిగి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వచ్చారని తెలిపారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల వారు విసిగి వేసారిపోయి ఉన్నారని, మళ్లీ కేసీఆర్ రావాలని, ఆయన ద్వారానే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు.



తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం నుంచి ..



కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం నుంచి..



కులకచర్ల నుంచి బస్సులో వరంగల్ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



నవాబుపేట మండలంలో జెండాను ఎగరవేసిన నాయకులు



తాండూరు: బషీరాబాద్ మండలం నుంచి..



కొడంగల్: హస్నాబాద్ గ్రామంలో జెండా ఎగరవేసిన బీఆర్ఎస్ నాయకులు



పూడూరు మండల కేంద్రం నుంచి ..



బంట్వారంలో జెండాను ఎగరవేసిన నాయకులు



తాండూరు నియోజకవర్గం యాలాల మండలం నుంచి..



కొడంగల్: ఆలేడు గ్రామంలో జెండా ఎగరవేసిన బీఆర్ఎస్ నాయకులు

## రెండు బైకులు ఢీ..వ్యక్తి మృతి

కులకచర్ల, ఏప్రిల్ 27 : రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కులకచర్ల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామునిపల్లి గ్రామానికి చెందిన చితకింది కృష్ణయ్య(47), ఈయనతో పాటు మరో ఇద్దరు గర్క గోవింద్, గర్క నాగయ్య ముగ్గురు బైక్‌పైన మహమ్మ దాబాద్ మండలం తిరుమలగిరికి బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా కులకచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కాళమ్మ సమీపంలో మోత్కూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు బైకుపై వస్తుండగా రెం డు ఢీకొనడంతో బైక్‌పైన ఉన్న చింతకింది కృష్ణయ్యకు తీవ్రగాయాలు కాగా ప్రైవేటు వాహనంలో పరిగి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి ఆయన అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మిగితా వారికి స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స నిర్వహించినట్లు తెలిపారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కులకచర్ల, ఏప్రిల్ 27: చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు దగ్ధమైందని గ్రా మస్తులు తెలిపారు. చాకల్‌పల్లి గ్రామానికి చెందిన హరిజన్ మల్కమ్మకు చెందిన ఇల్లు ఆదివారం ఉదయం 11గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఇంట్లో ఉన్న ఆహార సామగ్రితో పాటు ఇతర వస్తువులు పూర్తిగా అగ్నికి అంటుకు పోవడంతో బాధితులు నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరు లేక పోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఉన్న సామాగ్రి పెద్ద మొత్తంలో దగ్ధమైందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నిందితురాలు రిమాండ్‌కు తరలింపు




కొడంగల్, ఏప్రిల్ 27: చైన్ స్నాచర్ కేసులో నిందితురాలిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో టేకల్‌కోడ్ గ్రామానికి చెందిన రాములమ్మ, దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన నారాయణమ్మలు వేరు వేరు బస్సును ఎక్కుతుండగా పరిగిలోని తుంకుల్‌గుడ్డకు చెందిన అనంతమ్మ ఇరువురి మహిళల నుంచి బంగారాన్ని అపహరించింది. బస్టాండ్‌లో నిర్వహించిన పోలీసుల పరిశీలనలో నిందితురాలిని పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆమె నుంచి రెండు తులాల బంగారాన్ని రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితురాలిని హైదరాబాద్‌లోని చంచల్‌గుడా జైలుకు తరలిస్తున్నట్లు తెలిపారు.



కులకచర్ల, ఏప్రిల్ 27 : కులకచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన గాదె రాములు ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన చలివేంద్రాన్ని నాయకుడు కరణం ప్రహ్లాద్‌రావు ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాములు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

## పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ..



బసిరెడ్డిపల్లిలో నిరసన ర్యాలీలో కృష్ణానంద గురుస్వామి

పరిగి, ఏప్రిల్ 27: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం పరిగి మండలం బసిరెడ్డిపల్లిలో కృష్ణానంద గురు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణానంద గురుస్వామి మాట్లాడుతూ పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని ఖండించారు. ఈ ఘటనలో దోషులను వెంటనే శిక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కృష్ణానంద స్వామి సేవా సంస్థ అధ్యక్షుడు మహేందర్, లాలప్ప, శంకర్, విఠల్, కరుణాకర్, నరసింహ, వేమన్న, శ్రీశైలం, ఖాజ, జగన్నాథ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### మర్పల్లి మండల కేంద్రంలో..



మర్పల్లి, ఏప్రిల్ 27 : పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పులను ఖండిస్తూ మర్పల్లి మండల కేంద్రంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వ హించారు. బసవేశ్వర చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు గ్రామంలోని వీధుల్లో నుంచి పాకిస్థాకు వ్యతిరేకంగా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు..

## నామమాత్రంగా పారిశుధ్య పనులు

### దుర్వాసనతో చౌడాపూర్ వాసులు ఇబ్బందులు

కులకచర్ల, ఏప్రిల్ 27 : చౌడాపూర్ మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో పారిశుధ్యం పనులు సక్రమంగా జరగక పోవడం వలన ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మురుగునీరు రోడ్డుపైనే పారుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీల ద్వారా పారిశుధ్యపు పనులు నిర్వహించాల్సి ఉండగా పంచాయతీలో నామమాత్రంగా పనులు నిర్వహించడం వలన ప్రజలు ఇబ్బందులకు గురవు తు న్నారు. గతంలో పంచాయతీలో సక్రమంగా పారిశుధ్యపు పనులు నిర్వహించేవారని కాని నేడు ఈ విషయంపై పంచాయతీ సక్రమంగా పనిచేయక పోవడంతో మురుగు నీటి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం పనులు సక్రమంగా నిర్వ హించి దుర్వాసన నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు. పంచాయతీలో పారిశుధ్యపు పను లు సక్రమంగా అమలు అయ్యేవిదంగా ఉన్నతా ధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962